# పంజరంలోని పక్షి

చీకటి పడింది. ఏడున్నర గంటలు దాటింది. మేడిచర్ల రోడ్డుమీద ఒక రెండు ఎడ్లబండి నడుస్తోంది. మెల్లిగా ఎద్దుల మువ్వల చప్పుడు తప్ప, వాతావరణ మంతా ప్రశాంతంగా ఉంది. ఇరుప్రక్కల చెట్లు ఆకులు ఆడిస్తూ బండివైపు పరీక్షగా నిక్కిచూస్తున్నాయి.

ఊరకుక్క ఒకటి రోడ్డుమీదనుంచి నడిచిపోయింది, చెత్త వాసన చూసుకుంటూ.

దూరంగా నడుస్తున్న బండి వెదురుటాపుమీద మంట లేచింది. మంటతో బండి వడిగా పరుగెత్తింది. పరుగెడుతున్న బండి హఠాత్తుగా ఆగిపోయింది.

మంటలు భీకరంగా నాలికలు సాచుకుని ఆకాశంవైపు ఎగురుతున్నాయి. అంతా భస్మం చేస్తామన్నట్లు బండి నుసి అయింది సగం.

ఉదయం సూర్యకాంతి బండిని ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టింది—రాత్రి మంటల రహస్య మేమిటని ప్రశ్నించింది?

పొలానికిపోయే ఒక కామందు చూశాడు కాలిన బండిని. ఆశ్చర్య పోయాడు. బండిచుట్టూ విచిత్రంగా పరీక్షగా తిరుగుతున్న అతని కాలికి ఏదో మెత్తగా తగిలింది. ఉలిక్కి పడ్డాడు కామందు-శవం!!

పొలానికిపోయే కామందు ఇంటిముఖం పట్టాడు ఒగుర్చు కుంటూ కంగారుగా.

మరో గంటలో పోలీసుతో కామందు తిరిగి వచ్చాడు. పోలీసు చూశాడు బండిని. శవాన్ని పరీక్షించాడు. రెండూ గుర్తుపట్టాడు. కామందును కాపలా పెట్టి పోలీసు నిష్క్రమించాడు.

కామందు ఒంటరిగా రోడ్డు ప్రక్క మైలురాయిపై కూర్చున్నాడు ఆలోచనగా. పొరుగూరు రత్నమ్మకు ఇటువంటి దుస్థితి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. రత్నమ్మభర్త కరణంగా ఉన్నా రోజుల్లో కామందు సలహా లేనిదే ఏ పనీ చేసేవాడు కాదు. వారి ఆస్తి పాస్తులు దర్జా, రత్నమ్మకు యిటువంటి మరణం సంప్రాప్తింప చేస్తాయని ఎన్నడూ కామందు ఊహించే అవకాశమైనా కలగలేదు.

ప్రొద్దు మీదికెక్కుతోంది. కామందు ఒళ్ళు వేడెక్క సాగింది. ఎవరా హంతకుడు! ఈనాడు రత్నమ్మ చనిపోయింది; రేపు మరొకడు చనిపోవచ్చు ఆ హంతకుడి చేతిలో! వాడిని ఎలాగైనా పట్టి, గట్టిశిక్ష విధించాలి ! కామందు ఆలోచనలు రంకుల రాట్నంలా గిరగిర తిరుగు తున్నాయి!

కరణం రామయ్య జట్కాలో కూర్చొని రోడ్డుమీద వస్తున్నాడు రైల్వేలైను పరీక్షించే ఉద్యోగిలా ఇటు అటు చూస్తూ. హఠాత్తుగా జట్కా ఆపి తనూ దిగాడు. ఎర్రపంచ, తలపాగా, మోచేతుల జుబ్బా ఉన్నా రామయ్య దిగీదిగగానే కాలిన బండి, నేలమీద శవం చూసి గుండె బాదుకున్నాడు.

నా కొడుకేమైపోయాడు? దుఃఖంతో అరిచాడు. కామందు దగ్గరకు వెళ్ళి పరామర్శించాడు. కామందుకు కథ అర్ధమయింది.

రామయ్య తన కొడుకును కాపలా యిచ్చి రత్నమ్మను పొరుగూరు పెళ్ళికి పంపాడు. పెళ్ళి హఠాత్తుగా నిర్ణయింపబడడం, తప్పనిసరిగా రాత్రి ప్రయాణం చెయ్యవలసిన రత్నమ్మ, రామయ్య సహాయం, సలహా కోరింది. భర్త తర్వాత, కరణీకంలోకి వచ్చిన రామయ్యంటే ఆమెకున్న గౌరవం అపారం. ఆమెమాట కాదనలేక రామయ్య తన కొడుకు బాలయ్యను తోడుగా పంపాడు.

రెండెద్దుల మువ్వలబండి సింగారించాడు బాలయ్య. రంగులబండి చూసి రత్నమ్మ పొంగిపోయింది. ఒళ్లంతా సింగారించుకుంది నగలతో. పెళ్ళికి వెళ్ళినప్పుడు నగలు ఇంట్లో వదలిపోవడం మంచిదికాదని—బాలయ్య ఔనన్నాడు—సింగారించుకున్న రత్నమ్మ రంగుల రెండెద్దుల బండి సరదాగా ఎక్కింది. గిత్తలు ఒయ్యారంగా నడిచాయి. రామయ్య సాగనంపాడు. సాయంత్రం భోజనంచేసి బయల్దేరిన బండి ముప్పై మైళ్ళ దూరంలో ఉన్న గ్రామానికి తెల్లవారుఝాములోగా చేరవచ్చని ఆశపడింది రత్నమ్మ, తెల్లవారేలోగా రత్నమ్మ జీవితంలోని గమ్యస్థానమే చేరింది.

రామయ్య ఒళ్ళు సూర్యుడి వేడిలో కుతకుత ఉడికిపోయింది. రత్నమ్మను చంపిన హంతకుడు తన కొడుకును ఏ చిత్రవధ చేశాడో అని కుమిలాడు. పోలీసు జవాను వచ్చాడు. ప్రక్కనే మరొక అధికారి అక్కడి పరిస్థితి అంతా పరిశీలించాడు.

తన కొడుకును మాయం చేసినవాణ్ని పట్టుకోమని ప్రాధేయ పడ్డాడు రామయ్య. అతని ఆర్తనాదం శ్రద్ధగా పరిశీలించాడు పోలీసు అధికారి. పోలీసు అధికారి బండిచుట్టూ పరిశోధించాడు — ఒక గుడ్డపీలిక, సగం కాలినది — అగ్గిపుల్లల పెచ్చె—చిన్న సీసా—కనిపించాయి. సీసా వాసన చూశాడు అధికారి, కిరసనాయిలు వాసన వెదజల్లింది

శవాన్ని తీసుకుపోయి రత్నమ్మ బంధువులకు అప్పచెప్పాలని నిశ్చయించాడు. గొంతుకలోని రక్తపునాటు స్పష్టంగా కనిపిస్తోంది. ఎవరో పొడిచి రత్నమ్మను చంపారని అధికారి నిర్ణయించాడు. రామయ్య గుండె వేగంగా కొట్టుకోసాగింది. తన కొడుకును కూడా ఎవరైనా చిత్రవధచేసి హత్య చేశారేమో అతడి శవం కూడా కనిపించటంలేదే!! దుఖంచాడు రామయ్య.

వెంట వచ్చిన పోలీసు ఒక మైలువరకు అటూ ఇటూ రోడ్డు సోదాచేశాడు. ఎక్కడా ఏమీ కనిపించలేదు. హత్య జరిగిన స్థలం ఒక ఫర్లాంగు వెనుక ఒక ఈత చెట్టుకు కత్తి నాటుకుని కనిపించింది. పోలీసు కత్తి తీశాడు. చివర కొద్దిగా ఎరుపురంగు కలిగిన ఆ కత్తి తప్పక హంతకుడిదే అయి ఉండవచ్చనుకున్నాడు పోలీసు. ఆ కత్తి అధికారికి య్వివబడింది. పరిశోధించాడు ఆయన ఆ కత్తిని. దానిమీద పేరు 'కనకయ్యా-మేడిచర్ల' ఈలవేశాడు అధికారి.

రామయ్య జట్కా వెనుకకు కదిలింది. పోలీసు శవంతో నిష్క్రమించింది కారులో. కామందు ఆశ్చర్యపోతూ మిగిలి

పోయిన సగం కాలిన బండివైపు ఒకసారి చూసి నిట్టూర్చి ముందుకు సాగిపోయాడు.

*  *  *  *

రత్నమ్మకు దహన క్రియలు సాక్షిగా జరిగిపోయాయి. రామయ్య కూడా ఆ దహన సంస్కారాలకు హాజరయి కొడుకు గురించే పలవరించ సాగాడు. గ్రామమంతా రామయ్యకు సానుభూతి చూపించారు. పోలీసు అధికారికి మరీ మరీ విన్నవించుకున్నాడు రామయ్య, తన కొడుకును మాయం చేసిన హంతకుణ్ణి పట్టి తెస్తే తన ఆత్మకు శాంతి కల్గుతుందని.

పోలీసు అధికారి పరిశోధన ప్రారంభించారు. మేడిచర్ల కనకయ్య కత్తుల దుకాణంలోకి వెళ్లాడు. బొజ్జ కనకయ్య నమ్రతగా నిలుచున్నాడు. పోలీసు అధికారి కత్తి తీశాడు. కనకయ్య వణికి పోయాడు.

"నీదేనా?" అడిగాడు అధికారి.

కత్తుల దుకాణం కనకయ్య కాదనలేకపోయాడు.

కత్తి కథ కదిలింది.

ఆరేళ్లక్రితం అది తయారయింది. బాగా పదను. వెండి పొన్నులా ఖరీదైనదే. హత్య జరిగిన ఒక రోజుముందు ఒక నల్లటి పొడుగాటి మనిషి–గిరజాల జుట్టు, ఎర్రటి కళ్లు, కొంచెం వంకర నడక–కొన్నాడు కత్తి. ఎందుకో తెలియదు. అధికారి వివరాలు వ్రాసుకున్నాడు. ఆ మనిషి రోడ్డుకు దక్షిణంవైపుగా వెళ్ళిపోయ్యాడని చెప్పాడు కనకయ్య.

పోలీసు అధికారి రోడ్డుకు దక్షిణవైపుగా నడిచాడు. కిరానా దుకాణాలు కూరల అంగళ్ళు కనిపించాయి.

రెండు మూడు కిరానా దుకాణాలు తనిఖీ చేశాడు అధికారి.

ఈమధ్య నెవరైనా కిరసనాయిలు తీసుకెళ్లారా?

రోజూ ఎంతోమంది తీసుకెడతారు.

తెలియనివాళ్లు-క్రొత్తవాళ్లు!

మేము తెలుసుకోవలసిన అగత్యమేమిటి? పైసలిస్తే ప్రతివారు తీసుకెళ్ళవచ్చు!

ఆ ఎదురు జవాబులు అధికారిని చికాకు చేశాయి. కళ్ళు ఎర్ర చేసాడు. పళ్ళుకొరుకుతున్నట్లు ముఖం పెట్టాడు.

ప్రక్కనున్న ఆసామి పరిస్థితి సర్దాడు. "సరిగా చెప్పవయ్యా! ఆయన పోలీసాయన, సరిగా మాట్లాడకపోతే జైలులో-"సగం మిరిగాడు ఆసామీ.

హయ్యబాబోయి! అంత గొడడ నాకెందుకు.

'చెప్పితిగదయ్యా! మొన్న అనుకుంటా ఒకాయన ఎర్రపంచ, మల్లుజుబ్బా, నల్లటి పొడుగాటి మనిషి-గిరజాల జుట్టు-కిరసనాయిలు, అగ్గిపెట్టె కొనుక్కు వెళ్ళాడు కంగారుగా రూపాయి ఇచ్చి చిల్లర కూడా పట్టుకెళ్ళలేదు. నాకు ఆశ్చర్యం వేసింది. ఆ పైసలు ఇంకా నాదగ్గరే ఉన్నాయి-నువ్వు తీసుకెళ్లి ఇచ్చెయ్యిబాబూ. నన్ను జైలులో పెట్టకు." కాళ్ళు పట్టుకున్నాడు కిరాణాదారు.

అధికారి అది వ్రాసుకున్నాడు. ఆవలించాడు ఒక క్షణం. ఎవరా మనిషి? ఆలోచించ సాగాడు.

రామయ్యా ఇంటికి వచ్చాడు అధికారి. ఇల్లంతా పరీక్షించాడు. బాలయ్యది దృఢమైన శరీరం-పొట్టి ఆకారం తెలుపు. ఎర్రపంచ, మల్లుజుబ్బా కడతాడు అప్పుడప్పుడు తలపాగా. ఏమీ దొరకలేదు అధికారికి నవ్వుకున్నాడు.

'బండి కాలిన వార్త నీకేలా తెలిసింది.' అధికారి అడిగాడు పరధ్యాన్నంగా.

ఎడ్లు యింటికి వచ్చేసాయి ఒంటరిగా కళ్ళల్లో నీళ్ళు రాగానే నాకు ఆశ్చర్యం వేసింది. పరామర్శించాను. బండి లేకుండా, మనుషులు లేకుండా వచ్చేయడం చాలా చిత్రం అనుకున్నా. తెల్లటి ఎడ్లు వళ్ళంతా మసితో నల్లబడ్డాయి. తుడిచాను, ఏదో అఘాయిత్యం జరిగిందనుకున్నాను. తక్షణం జట్కా వేసుకొని ఆ రోడ్డుమీద బయలుదేరాను వెతుక్కుంటు. రామయ్యా గత చరిత్రలోని భాగం వివరించాడు.

అధికారి దొడ్లోకి వెళ్ళాడు. ఎడ్లను పరిశీలించాడు. పాలేరు కర్ర పుచ్చుకుని ఊతంగా లోపలికి వచ్చాడు. ఒక్కసారి పోలీసు అధికారివైపు చూసి చికితుడయ్యాడు. మామూలుగా తలవంచుకుని లోపలికి వచ్చి ఎడ్లపాక శుభ్రం చేశాడు. అధికారి పాలేరును తీవ్రంగా పరిశీలించాడు. ఈలవేశాడు.

రామయ్యాను వదిలి వెళ్ళిపోయాడు.

మర్నాడు రామయ్యా యింటికి పాలేరు రావడం మానేశాడు.

చేతులకు బేడీలు తగిలాయి. ఒక అర్థరాత్రి జైలులో నిర్బంధం చేశాడు పోలీసు అధికారి. ఊరంతా పొక్కిపోయింది. రామయ్య గుండె కుతకుత ఉడికిపోయింది. ఆశ్రయం యిచ్చి పోషించిన తన నౌకరే రత్నమ్మను కొడుకును హత్యచేసి ఉంటాడనే అనుమానంతో సతమతమయ్యాడు. ఏం చెయ్యడానికి తోచలేదు. అయినా తీర్పు వినాలనుకున్నాడు.

అధికారి అడిగాడు పాలేరును. కత్తుల కనకయ్య చెప్పిన ఆకారం అతడులో ఉంది. కాని దుస్తులు కావు. విచిత్రం! పాలేరు చెప్పాడు వివరాలు. అధికారి ఒక్కసారి అంతర్గతంగా ఆలోచించాడు. ఊళ్ళోకి బయలు దేరాడు.

భోగం కొంపలవైపు నడిచాడు. స్ఫురద్రూపి పోలీసు అధికారి. అనవసరంగా ఆ యిళ్ళకు వెళ్ళలేదు ఎప్పుడూ. ఇప్పుడు లోపలికి వెళ్లాలి మాట్లాడాలి. అడుగు పెట్టాడు గడపలో.

"రండి! రండి! ఎంత కాలానికి వచ్చారు!" తాంబూలం నములుతున్న శ్రీహరి ఆహ్వానించింది.

"మీయిల్లు చూడాలని వచ్చాను!" నవ్వాడు అధికారి. ఇల్లు, ఇంటిలోని మనుషులను చూపింది శ్రీహరి. వెళ్ళిపోయాడు మౌనంగా అధికారి ఇంట్లోంచి. దీనంగా శ్రీహరి అతనివైపు చూసింది. అమ్మడు రమ్మంది ఇంట్లోకి రోడ్డుమీద నడిచే అధికారిని.

అడుగు పెట్టాడు లోపలికి అధికారి. అమ్మడు తాంబూలం అదించింది. చెక్క నమిలి ఊరుకున్నాడు అధికారి. పడకటిల్లు,

ప్రక్క గదులు తిరిగాడు. 'ఎవరిని వల వేయడానికి వచ్చారు?' నవ్వింది అమ్మడు.

'నిన్ను కాదు. బెంగపెట్టుకోకు!' ఠీవిగా బయటికి నడిచాడు అధికారి.

ఆలోచనతో పోయి ఆఫీసు గదిలో కూర్చున్నాడు.

ఒక పోలీసు వెంట ఒక మార్వాడీ వచ్చాడు. 'రత్నమ్మ కంఠె కనిపించింది—ఇతనివద్ద' పోలీసు అరిచాడు.

మార్వాడీ వివరాలు చెప్పాడు. వెంకట్రావు-దృఢంగా-పొట్టిగా-తెల్లగా మల్లుచొక్కా, ఎర్రపంచ-వచ్చి అమ్మేడు-నిజం' అంటూ కాళ్ళమీద పడ్డాడు మార్వాడీ! కంఠె తన దగ్గర వుంచుకొని మార్వాడీని కనికరించాడు అధికారి.

ఒకరాత్రి-మనిషి పరదాలో-పోలీసు అనుసరించాడు. గోడ్లు దాటి సందులు మళ్ళి అమ్మడింట్లో అడుగు పెట్టాడు ఆ పరదా మనిషి. స్త్రీ, స్త్రీయింట్లోకి వెళ్ళడం-విచిత్రం అనిపించింది-పోలీసుకు.

తలుపు దగ్గర నుంచున్నాడు.

శబ్దం-గొంతు-అదే.

ఒక్క పరుగులో చేరాడు ఆఫీసుకు. మరో యిద్దరి పోలీసులను పిల్చుకు వచ్చాడు. అధికారిని రమ్మన్నాడు. కలిసి వెళ్లారు అమ్మడి యింటివైపు.

పోలీసులు దగ్గరలో సందు మలుపులో కాపలా. అధికారి అడుగు పెట్టాడు, తలుపుతట్టి.

తలుపు తెరుచుకుంది.

అమ్మడు ఆహ్వానించింది-

ఈసారి తాంబూలం నమిలాడు అధికారి. పడకగదివైపు నడిచాడు-

అమ్మడు గుండె బితుక్కుమంది. గది శూన్యం, నవ్వాడు అధికారి. దొడ్లోకి నడిచాడు.

చేతిలోని టార్చి ఇటు అటు త్రిప్పాడు. అన్నీ పాత వస్తువులే మునుపటివే-కదిలి వరండాలోకి వచ్చాడు. కుర్చీలో కూర్చున్నాడు. "పరిశోధనకా? పండుకోటానికా?" నవ్వింది అమ్మడు.

'ఇది చేస్తేకాని-అది కాదుకదా?' నవ్వాడు అధికారి. కుర్చీలో కూర్చొని ఆలోచనగా పైకి చూశాడు. గుమ్మిడికాయలు దూలాలకు వేళాడుతున్నాయి.

టార్చి పైకివేశాడు ఇంటికప్పులోపలికి ఒక దూలాన్ని అంటిపెట్టుకున్న ఒక తెల్లని వస్తువు-గుమ్మిడికాయి. కళ్ళు నులుముకున్నాడు.

అమ్మడు వెకిలిగా నవ్వి అధికారి దగ్గరిగా వచ్చింది. తంబూలం మరొకటి నోటికి అందించింది. అమ్మడిని ఆలింగనం చేసుకున్నాడుఅధికారి. హుషారులో హుషారుగా ఈలవేశాడు. ముగ్గురు పోలీసులు గుమ్మంలో హాజరయ్యారు.

అమ్మడు ఈరాత్రి దాడికి ఆశ్చర్యం ప్రకటించింది. అమ్మడు పాతివ్రత్యం కాపాడగలనని అభయ మిచ్చాడు అధికారి.

పోలీసులకు వ్యాయామం కోసం తలలు పైకెత్త మన్నాడు. టార్చి వేశాడు అధికారి.

ఒక దూలానికి ఇంటికప్పుకు దగ్గరగా కాళ్ళు-చేతులు ఇరువైపుల బంధించి బల్లిలా అంటిపెట్టుకున్నట్లు ఉన్న ఆకారం కనిపించింది. జేబులోని పిప్పరమెంటు విసిరాడు అధికారి దానివైపు. కదలిక లేదు.

"దూలం" నవ్వింది అమ్మడు.

పరదా మనిషి పారిపోయాడని ఆమె విశ్వాసం. 'దిగుతావా-పిస్టలు కాల్చనా' నవ్వుతూ అమ్మడివైపు చూశాడు అధికారి. "నన్ను కాల్చకండి బాబూ-ఎక్కడ దిగమంటే అక్కడ దిగుతా!" అమ్మడు దీనంగా మొఖం పెట్టింది.

ఇంటి కప్పువైపు ఒక పిస్టలు దూసుకు పోయింది. దూలాన్ని అంటిపెట్టుకున్న బల్లి కదిలింది.

కాళ్ళు విదిల్చి క్రిందకు జారాడు.

చేతులతో దూలం పట్టుకు ఊగాడు. పందిరి మంచం కిందకు లాగితే దానిమీదకు గెంతాడు.

పోలీసులు కొరడాలతో చుట్టూ నిలుచున్నారు. బాలయ్య నవ్వాడు.

"నగలన్ని ఏమయ్యాయి-?" అధికారి ప్రశ్నించాడు.

అమ్మడివైపు చూశాడు బాలయ్య.

అమ్మడు దిగులుగా కంగారు పడింది. బాలయ్యకు బేడీలు, అమ్మడి బోషాణాలు పరిశోధన. కొంత ధనం, కొన్ని నగలు పోలీసులు కూపీ తీశారు.

హంతకుడు బాలయ్య! ఊరిలో పాక్కిపోయింది వార్త. కాని కోర్టు యింకా నిర్ణయించలేదు.

రామయ్య గుండె ఆగి మరణించాడు.

ఇప్పుడు మాత్రం నిజంగా బాలయ్య హంతకుడే. సమాజం నిర్ణయించింది.

ఆ నిర్ణయం కోర్టుకు చేరింది. కోర్టు కూడా నిర్ణయించింది. బాలయ్య హంతకుడే! బేడీలు పడిన బాలయ్య కటకటాల జైలులోంచి ఆకాశంవైపు చూశాడు. జైలు విడిచి వెళ్ళి పోతున్న పాలేరువైపు చూశాడు.

పంజరంలోని పిట్టలు — అమ్మడు ఇంట్లోవి జ్ఞాపకం వచ్చాయి. పూర్వాశ్రమంలో అమ్మడి యింటి పంజరంలోని పిట్ట ప్రభుత్వపు పంజరంలోకి చేరింది. స్థితిగతులలో ఎక్కువ మార్పు లేదనిపించింది. జైలు నౌకరు భోజనం కటకటాల్లోంచి అందించ్చాడు. అమ్మడు యింట్లో తనకు అమ్మడు భోజనం పెట్టినట్లు—అమ్మడియింట్లో పంజరములోని పిట్టలకు తాను గింజలు వేసినట్లు.

జైలు గోడలమధ్య గత చరిత్రల ఊహాగానాలతో ఎగిరాడు బాలయ్య పక్షిలాగే. ఇతంతా మిథ్య అనుకున్న బాలయ్య నిర్విచారంగా జైలువాళ్ళు తెచ్చిన ఉప్పు అన్నం తిని ఊరుకున్నాడు మౌనంగా మందస్మితం చేస్తూ.

అతని మందస్మితంలోంచి ఒక కూనిరాగం పక్షికూతలా వెలికి వచ్చింది. ఆకాశంలో వింత వెలుగులు కనిపించాయి శబ్దాలతో. విజ్ఞాన శాస్త్రజ్ఞుల వితండ ప్రయోగాలా?

కాదనిపించింది—బాలయ్యకు. ఆనాడు దీపావళి. చీకటిలోంచి వెలుగు జ్వాలలు. తన బ్రతుకు చీకటికి గమ్యమైన ఉదయ జ్వాలలు. మిథ్య చీకటి బ్రతుకులను లెక్క చెయ్యకుండా వెలిగే ఆలోచనలు బాలయ్య మెదడులో కదిలాయి. జీవితంలో కావలసింది—ఆలోచన దాని అమలు. మంచి, చెడు లేని ప్రపంచములో కార్యసాధనే ఒక గమ్మత్తు వెలుగు చైతన్యం!! అదే వెలుగు తనలో ఉన్నట్లు భావించాడు. తెల్లటి బాలయ్య ఆ చీకటి కటకటాల జైలు గోడలమధ్య ఏదో చిన్న వెలుగులా కనిపించాడు జైలు కాపలాదారుకు.